క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఈనెల 21న విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. గోపాల్‌పూర్, కేయూసీ, యాదవనగర్, మడికొండ, టేకులగూడెం, వెస్ట్‌సిటీ సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 10.30 గంటల వరకు, కలెక్టరేట్ సబ్ స్టేషన్ ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీచర్స్ కాలనీ, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు తెలిపారు. ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని డీఈ శెంకేశి మల్లికార్జున్ తెలిపారు. శంభునిపేట, దేశాయిపేట, ఉర్సు, పోతన, ఆజంజాహి మిల్స్, స్టేషన్ రోడ్డు, ఖిలా వరంగల్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 11 గంటల వరకు, కాకతీయ మెడికల్ కళాశాల, పోచమ్మమైదాన్ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

ఆత్మగౌరవానికి ప్రతీక 'బాపూజీ'

వరంగల్ అర్బన్: తెలంగాణ ఆత్మగౌరవానికి కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రతీకగా నిలిచారని నగర మేయర్ గుండు సుధారాణి ఆమె ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన లక్ష్మణ్ బాపూజీ 109వ వర్ధంతి సందర్భంగా వాడవాడలా శనివారం కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళి అర్పించారని గుర్తుచేశారు.

తెలంగాణ ఉద్యమకారుడి మృతి


సారంగపాణి (ఫైల్)


వరంగల్: తెలంగాణ ఉద్యమకారుడు బింగి సారంగపాణి అనారోగ్య సమస్యలతో నగరంలోని 21వ డివిజన్ తారకరామవీధి ఎల్బీనగర్‌లో గురువారం రాత్రి మృతి చెందారు. 1982లో టీడీపీలో చేరిన సారంగపాణి (62).. ప్రత్యేక రాష్ట్రం కోసం టీఆర్ఎస్ పార్టీలో చేరి పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. 2001లో టీఆర్ఎస్ పార్టీ అర్బన్ జిల్లా కార్యదర్శిగా, 2003లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా పలు పదవులు నిర్వహించారు. మృతుడికి భార్య సరోజన, ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా, సారంగపాణి మృతికి బీజేపీ నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, ఆకెన వెంకటేశ్వర్లు, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, బీఆర్ఎస్ నాయకుడు అచ్చ విద్యాసాగర్, తెలంగాణ ఉద్యమకారులు కొడారి రవి, రాంపల్లి శ్రీనివాస్, బొలిశెట్టి అశోక్, గాదె ప్రభాకర్, పెరుమాళ్ల లక్ష్మణ్ సంతాపం వ్యక్తం చేశారు.

బాధిత రైతులకు భరోసా



నయీంనగర్: ఇన్నర్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయం చేస్తామని కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి భరోసా కల్పించారు. తమ సమస్యలు పరిష్కరించాలని పైడిపల్లి, ఆరెపల్లి గ్రామాలకు చెందిన రైతులు కుడా కార్యాలయంలో ఆయనను కలిసి వినతిపత్రం ఇచ్చారు.

క్రీడాకారులకు దుస్తుల పంపిణీ



వరంగల్: రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈనెల 21నుంచి 23వ తేదీ వరకు జరగనున్న 10వ రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ -2024 పోటీలు జరగనున్నాయని జిల్లా సాఫ్ట్‌బాల్ ప్రధాన కార్యదర్శి పూజారి అశోక్ బాబు తెలిపారు. ఈమేరకు పోటీల్లో పాల్గొనున్న వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ బాలబాలికల జట్లకు హనుమకొండలోని హాసిని చిట్‌ఫండ్ కంపెనీ క్రీడాదుస్తులను శుక్రవారం అందజేసిందని పేర్కొన్నారు. వరంగల్ రైల్వేస్టేషన్‌లో క్రీడాకారులకు దుస్తులు అందజేసిన చిట్‌ఫండ్ మేనేజర్ శివప్రసాద్, ఎండీ లింగం కిరణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ ప్రతినిధులు బీమగాని ముఖర్జీ, పీడీ భవాని, పీడీలు లింగమూర్తి, కమలకుమారి, కోచ్‌లు సందీప్, ఈశ్వర్, అర్వీన్, సుమిత్ర పాల్గొన్నారు.

కొనసాగిన తనిఖీ

కాజీపేట రూరల్: హసన్‌పర్తి–కాజీపేట మూడో రైల్వే లైన్‌ను, బైపాస్ లైన్‌ను, రైల్వే సొరంగ మార్గాన్ని శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే కమిషనర్ ఆఫ్ రైల్వే సేఫ్టీ (సీఆర్ఎస్) మాధవి తనిఖీ చేశారు. సీఆర్ఎస్ తనిఖీలో భాగంగా గురువారం కాజీపేట–వరంగల్, హసన్‌పర్తి–వరంగల్, బైపాస్ లైన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. శుక్రవారం సీఆర్ఎస్ ట్రాలీలో మూడో రైల్వే లైన్ ట్రాక్ సామర్థ్యాన్ని, పాయింట్లను, క్రాసింగ్‌లను తనిఖీ చేశారు. బైపాస్‌లైన్‌ను తనిఖీ చేసిన సీఆర్ఎస్ సొరంగ మార్గంలోని ట్రాక్‌పై నడిచి ట్రాక్ ఫిట్‌నెస్‌ను పరిశీలించినట్లు అధికారులు తెలిపారు.

డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న కేవీ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు


హన్మకొండ: బహుమతులు ప్రదానం చేస్తున్న రవికుమార్

కాజీపేట అర్బన్: వందేభారత్ రైలు ప్రారంభోత్సవం సందర్భంగా రైల్వే అధికారులు ఏర్పాటు చేసిన డ్రాయింగ్, వ్యాసరచన పోటీల్లో పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. కడిపికొండలోని కేవీ పాఠశాల ఆవరణలో ఆ విద్యార్థులను, డ్రాయింగ్ టీచర్ అన్నబత్తుల వెంకన్నను పాఠశాల ప్రిన్సిపాల్ సుభాషిణి, ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

సెయింట్ పీటర్స్ విద్యార్థులు..

హన్మకొండ: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ 68వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో హనుమకొండ హౌసింగ్ బోర్డు కాలనీలోని సెయింట్ పీటర్స్ సెంట్రల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రథమ బహుమతి దుర్గా శాంభవి అందుకోగా, ద్వితీయ బహుమతి మహమ్మద్ ముస్తఫా, తృతీయ బహుమతి సెన్నేటి రెహనా, కన్సోలేషన్ బహుమతులు దివ్య తేజిని, సంతోషిని, విద్యానంద్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎల్ఐసీ డివిజనల్ మేనేజర్ సీకే రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఇంటికి బీమా.. జీవితానికి ధీమా అని అన్నారు. కార్యక్రమంలో ఎల్ఐసీ ఐటీ మేనేజర్ వెంకటరమణ, ఉద్యోగి రేష్మ, పాఠశాల హెచ్ఎం డాక్టర్ గోపు మథ్యాస్ రెడ్డి, డైరెక్టర్ సునీత రెడ్డి పాల్గొన్నారు.

మత విద్వేషాలను రెచ్చగొడుతున్న కేంద్రం


మాట్లాడుతున్న మూర్తి

రామన్నపేట: దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోదీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతోందని, ప్రజల్లో చీలిక తీసుకువస్తూ మతతత్వ రాజకీయాలను పెంచి పోషిస్తోందని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు నైనాల శెట్టి మూర్తి విమర్శించారు. నగరంలోని దేశాయిపేటలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్ పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పార్టీ రాష్ట్ర సదస్సులో ఆయన మాట్లాడారు. రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేందుకు కేంద్రం తీవ్రంగా యత్నిస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో బీజేపీ ఎదుగుదలకు బీఆర్ఎస్ పార్టీ అనుసరించిన విధానాలే ఉపయోగపడ్డాయని వివరించారు. ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, హనుమకొండ జిల్లా కార్యదర్శి రొయ్యల రాజు, భూపాలపల్లి జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేష్, జనగామ జిల్లా కార్యదర్శి గుమ్మడి రాజుల సాంబయ్య, ఖమ్మం జిల్లా కార్యదర్శి నూనావత్ వీరు నాయక్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు అనంతోజు రజిత, రాష్ట్ర కమిటీ సభ్యులు శ్రీనివాస్, గోల్కొండ కుమార్, ఐసా రాష్ట్ర కన్వీనర్ కిరణ్ కుమార్, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ పండుగకు ఏర్పాట్లు చేయాలి


ఆలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

హన్మకొండ కల్చరల్: వేయిస్తంభాల దేవాలయంలో బతుకమ్మ పండుగ, దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలని దేవాదాయశాఖ, మున్సిపల్ అధికారులను సూచించారు. శుక్రవారం రాత్రి వేయిస్తంభాల ఆలయాన్ని హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సందర్శించారు. ఈసందర్భంగా స్వామి వారిని దర్శించుకుని దేవాలయ ప్రాంగణాన్ని పరిశీలించి మాట్లాడుతూ.. అక్టోబర్ 2 నుంచి ప్రారంభమయ్యే బతుకమ్మ పండుగ, 3న ప్రారంభమయ్యే దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో నగర ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనే అవకాశం ఉన్నందున లైటింగ్ ఏర్పాటు చేయాలని, 'కుడా', పోలీస్ శాఖల సమన్వయంతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వెంకటయ్య, ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తల్లిని శ్రీనివాస్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కేటీఆర్ నగర పర్యటన



హన్మకొండ: త్వరలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు వరంగల్ పర్యటనకు రానున్నారు. శుక్రవారం హైదరాబాద్ నందినగర్ స్వగృహంలో కేటీఆర్‌తో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌బాస్కర్, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజు యాదవ్, కార్పొరేటర్ బోయినిపల్లి రంజిత్ రావు సమావేశమయ్యారు. త్వరలో వరంగల్‌కు రానున్నట్లు కేటీఆర్ ఈ సందర్భంగా తెలిపారు. కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదామని, రైతు రుణమాఫీ, రైతుబంధు అమలు చేసే వరకు పోరాడుదామని పిలుపునిచ్చారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి


వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నాయకులు మాట్లాడుతూ వెంటనే బీసీ కులగణన చేపట్టి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్లూరి పవన్, జిల్లా అధికార ప్రతినిధి బగ్గి రాజ్‌కుమార్, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు నాయిని సరస్వతి, జిల్లా మహిళా కార్యదర్శి ఆకుల విజయ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అధ్యక్షురాలు ఇమ్మడి ప్రసన్న, నాయకులు బాబు, రాజ్‌కుమార్, రాజు, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

23న 'కార్మికుల చలో హైదరాబాద్'


హన్మకొండ చౌరస్తా: మాట్లాడుతున్న నాయకులు

హన్మకొండ చౌరస్తా: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దనే ప్రధాన డిమాండ్‌తో ఈనెల 23వ తేదీన చలో హైదరాబాద్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య తెలిపారు. ఈమేరకు హనుమకొండ పబ్లిక్ గార్డెన్ వద్ద చలో హైదరాబాద్ కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా పథకాలను అమలు చేయాలని, ప్రమాద బీమాను రూ.10 లక్షలకు పెంచాలని, సహజ మరణానికి ఇచ్చే 1.30 లక్షల సాయాన్ని నుంచి రూ.5లక్షల వరకు పెంచాలని డిమాండ్ చేశారు.

హన్మకొండ: భవన నిర్మాణరంగ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించొద్దని ఉప్పలయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు సీఐటీయూ, బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో హనుమకొండలో శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 20న తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని, ఆగస్టు 27న నిర్వహించిన టెండర్లను రద్దు చేయాలని కోరారు. పలు డిమాండ్ల సాధనకు ఈనెల 23న హైదరాబాద్‌లోని కార్మిక కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించే ధర్నాను కార్మికులు విజయవంతం చేయాలని కోరారు.

సఖి సేవలపై అవగాహన ఉండాలి

హన్మకొండ అర్బన్: బాధిత మహిళలు, బాలికలకు సఖి కేంద్రం అందించే సేవలపై అవగాహన ఉండాలని సఖి సెంటర్ లీగల్ కౌన్సెలర్ శ్రీదేవి, కేస్ వర్కర్ వినీల సూచించారు. బాలసముద్రంలోని వాటర్ ట్యాంక్ సమీపంలో ఆర్‌పీ స్వర్ణలత ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలు, సఖి కేంద్రం అందిస్తున్న సేవల గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. సఖి కేంద్రం అందిస్తున్న ఐదు రకాల సేవల గురించి వివరించారు. సమస్యల్లో ఉన్నప్పుడు 181 లేదా 0870 2452112 నంబర్లకు కాల్ చేసి తక్షణ రక్షణ పొందాలని సూచించారు.

విద్యార్థుల పోరుయాత్ర ప్రారంభం


పోరు యాత్రతో పాల్గొన్న నాయకులు

విద్యారణ్యపురి: జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలలను సందర్శించి అందులోని విద్యార్థుల సమస్యలు తెలుసుకుని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో హనుమకొండ జిల్లా స్వేరో స్టూడెంట్ యూనియన్ ఆధ్వర్యంలో విద్యార్థుల పోరు యాత్రను చేపట్టారు. ఈమేరకు పోరుయాత్రను స్వేరో స్టూడెంట్స్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్ హనుమకొండలో శుక్రవారం ప్రారంభించి మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనం అందడం లేదని, మౌలిక వసతులు లేవని అన్నారు. అలాంటి సమస్యలను వెలుగులోకి తెచ్చేందుకు ఈ యాత్రను ప్రారంభించామని, ఈనెల 30వరకు కొనసాగుతుందని వివరించారు. కార్యక్రమంలో స్వేరో స్టూడెంట్స్ యూనియన్ బాధ్యులు గజవెల్లి శ్రావణ్, శివకుమార్, రవి, సిద్దు, అన్వేష్, నరేష్, సాయి, బాబు, మహేష్, తరుణ్, మనోహర్, రాకేష్ పాల్గొన్నారు.

కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు

కాశిబుగ్గ: కిశోర బాలికలు ప్రతిరోజూ పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ఆశాదేవి, రమాదేవి సూచించారు. పోషణ మాసంలో భాగంగా 35వ డివిజన్ శివనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు పోషకాహారంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జంకు ఫుడ్‌కు దూరంగా ఉంటూ పోషక విలువలు కలిగిన సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. బాలికలకు ముఖ్యంగా రక్తహీనత వచ్చే అవకాశం ఉందని, ఈక్రమంలో దాన్ని నివారించేందుకు ఆకుకూరలు, పల్లీలు, బెల్లం తినాలని వివరించారు. అలాగే వ్యక్తిగత శుభ్రత పాటించాలని పేర్కొన్నారు. అనంతరం పోషకాహారంపై విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్ఎం గందె శ్రవణ్‌కుమార్, అంగన్‌వాడీ టీచర్లు రాజు, సులోచన, వనజ, రమాదేవి, భాగ్యమ్మ, విజయలక్ష్మి, ఆశ కార్యకర్త సుమిత్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బంధం చెరువులోని చెత్త తొలగింపు

హన్మకొండ అర్బన్: వినాయక నిమజ్జంతో నగరంలోని కాజీపేట దర్గా సమీపంలోని బంధం చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలను 'మెదివి సాంఘిక సేవా సంస్థ' ఆధ్వర్యంలో శుక్రవారం తొలగించినట్లు సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ తెలిపారు. ప్రజలు ప్లాస్టిక్ వ్యర్థాలను చెరువుల్లో పడేయడం ద్వారా చెరువులు కలుషితమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ బాధ్యులు ప్రశాంత్ సుంకరి, ప్రసాద్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పిచ్చిమొక్కల తొలగింపు

మామునూరు: వరంగల్ 43వ డివిజన్ నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో శ్రీవెంకటేశ్వర కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు నాగబడి శ్రీనివాస్, 21 కాలనీల అధ్యక్షుడు కర్నె రవీందర్ కోరారు. ఈమేరకు కార్పొరేటర్ ఈదుల అరుణను విజ్ఞప్తి చేశారు. ఈమేరకు బల్దియా అధికారులు, సిబ్బంది స్పందించి ఏపుగా పెరిగిన ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు.

చదరంగ పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 22వ తేదీన హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ సమీపంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి అండర్ -15 బాలబాలికల చదరంగ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వహణ కార్యదర్శి పి.కన్నా తెలిపారు. ఈమేరకు హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి చేతుల మీదుగా చదరంగ పోటీల వాల్‌పోస్టర్లను ఏసీపీ కార్యలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. పూర్తి వివరాలకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పలు కాలనీల్లో సమస్యల పరిశీలన

ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్‌లో కనీస సౌకర్యాలు కల్పించాలని, ప్రజా సమస్యల పరిష్కరించాలని ప్రజలతో కలిసి బల్దియా ఎదుట కార్పొరేటర్ మరుపల్లి రవి చేపట్టిన నిరసన దీక్షకు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే శుక్రవారం స్పందించారు. ఈమేరకు కార్పొరేటర్‌తో కలిసి బీరన్ననగర్, రజకవాడ, డీకే నగర్, ప్రగతి నగర్, ఎల్లమ్మ తాళ్ల మండేవా, మంకీ ఫుడ్ కోర్ట్, ఉప్పరోనికుంట, ముకుందా ఎస్టేట్‌లో అధికారులు పర్యటించారు.

బీసీలకు ప్రాధాన్యం ఇవ్వాలి

హన్మకొండ: స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని బీసీ నాయకుడు పులి రజనీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని బీసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. బీసీల కులగణన చేయాలని, జనాభాలో 60 శాతంగా ఉన్న బీసీలకు సరైన ప్రాధాన్యం కల్పించాల్సిన అవసరముందని గుర్తుచేశారు. బీసీ సంఘం నాయకులు బుద్ధ వెంకన్న, గుండెకారి రంగారావు, రుద్రారపు రాజు, మహేష్ గౌడ్, రఘు, మహేష్ పాల్గొన్నారు.

పలువురికి జరిమానా

రామన్నపేట: వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో లైసెన్స్ లేకుండా వాహనం నడిపి పట్టుబడిన ఏడుగురు వాహనదారులకు రూ.8 వేల జరిమానా విధిస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 21మందికి రూ.30,100 జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. వాహనాలు నడుపుతూ పట్టుబడిన 13మంది బాలురను అదుపులోకి అబ్జర్వేషన్ హోంకు పంపినట్లు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపకుడికి సన్మానం

హన్మకొండ అర్బన్: ఇటీవల రాష్ట్రస్థాయి ఉత్తమ అధ్యాపక పురస్కారం పొందిన పింగిళి కళాశాల ప్రొఫెసర్ కొలిపాక శ్రీనివాస్‌ను కేయూ ఎస్‌డీఎల్‌సీ డైరెక్టర్ శ్రీనివాస్, సీడీసీ డీన్ ప్రొఫెసర్ రామచంద్రం శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఆధ్వర్యంలో శ్రీనివాస్ దంపతులను అభినందించారు.

డీఏ ఎరియర్స్ నగదు రూపంలో చెల్లించాలి

వరంగల్: కంటిబ్యూటరీ పెన్షన్ ఉద్యోగులకు, పెన్షనర్లకు డీఏ ఎరియర్స్ ఏకమొత్తంలో ఒకేసారి నగదు రూపంలో చెల్లించాలని మార్కెట్ ఉమ్మడి వరంగల్ జిల్లా మార్కెట్ కమిటీ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగపురి సారయ్య, సహ అధ్యక్షుడు తీగల కృష్ణస్వామి, ప్రధాన కార్యదర్శి జారతి సత్యనాథ్, కోశాధికారి అంబటి అశోక్‌కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో కోరారు.

బీసీ గురుకులాల ఆర్‌సీఓకు వినతిపత్రం

విద్యారణ్యపురి: మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకులాల్లో ప్రొవిజనల్ టెండర్లలో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ వాటిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తిరుపతి, జిల్లా సహాయ కార్యదర్శి చిరంజీవి కోరారు. ఈమేరకు హనుమకొండలోని బీసీ గురుకులాల ఆర్‌సీఓ కార్యాలయంలో ఆర్‌సీఓ రాజ్ కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేట బాలానగర వెంకటేశ్వర స్వామి దేవాలయ హుండీని శుక్రవారం లెక్కించారు. మొత్తం రూ.3,05,057 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ రత్నాకర్ రెడ్డి వివరించారు. ఆలయ కొబ్బరికాయల వేలంపాటకు సరైన స్పందన లేకపోవడంతో ఈనెల 30 నాటికి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సేవాసమితి మహిళా మండలి సభ్యులు, మాజీ ధర్మకర్త గందె గోవింద రాజులు, చిన్నాల వెంకటరమణ, వోలం గోవర్ధన్, పరిశీలకులు జి.సంజీవరెడ్డి, చైర్మన్ శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

కాజీపేట రైల్వే స్టేషన్‌లో వైద్య శిబిరం

కాశిబుగ్గ: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వరంగల్ రైల్వే స్టేషన్‌లో సఫాయి కార్మికులు, హమాలీలు, స్టాల్ వెండర్లకు శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే డాక్టర్ హరిబాబు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ మధు, ఫార్మసిస్ట్ తిరుపతి, స్టాఫ్‌నర్స్ జమున, సిబ్బంది పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి

మడికొండ: చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి చెందిన సంఘటన కాజీపేట మండలం భట్టుపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామానికి చెందిన బుర్ర రాంచరణ్(18).. భట్టుపల్లి గ్రామంలోని సిగ్మా జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. రాంచరణ్ ఆరోగ్యం బాగలేదని విద్యార్థి తండ్రి బుర్ర మల్లేశంకు కళాశాల ఉపాధ్యాయుడు ముద్దం సంతోష్ శుక్రవారం ఉదయం సమాచారం ఇచ్చారు. ఈమేరకు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రాంచరణ్ మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజబాబు తెలిపారు.

దాడి చేసిన వారిపై కేసు

మడికొండ: కాజీపేట బాపూజీనగర్ వినాయకుడి ఊరేగింపులో గొడవ జరిగింది. దాంతో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడి వివరాల ప్రకారం మడికొండ గ్రామానికి చెందిన కల్లెపు భిక్షపతి ఇంటిపైకి గురువారం రాత్రి 12గంటల సమయంలో పిట్ట అరవింద్, నాగపూరి అరవింద్, గండికోట భరత్, నార్లగిరి వినయ్, కిరణ్, వివేక్ దాడి చేశారు. నానా బూతులు తిడుతూ కర్రలతో భిక్షపతితో పాటు అతని కుమారుడిపై దాడి చేశారు. ఈక్రమంలో భయంతో బాధితులు 100 నంబర్‌కు డయల్ చేయగా వెళ్లిపోయి తిరిగి తెల్లవారుజామున 3గంటలకు మళ్లీ వచ్చి కిటికీ అద్దాలు పగులకొట్టి తలుపులపై కర్రలతో బాదారు. బాధితుడు భిక్షపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజబాబు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్: వరంగల్, ఖిలా వరంగల్ మండలాల పరిధిలోని అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు కోరారు. ఈమేరకు డీఈఓ జ్ఞానేశ్వర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ల్యాదల్ల శరత్ మాట్లాడుతూ వరంగల్, ఖిలా వరంగల్ మండలాల పరిధిలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలో ఎలాంటి అనుమతి లేకుండా సిట్టింగ్ పర్మిషన్, అగ్నిమాపక యంత్రాలు, ఆట స్థలాలు లేకుండా విద్యార్థులకు సరిపడా బాత్రూంలు లేకుండా పక్కా కమర్షియల్ బిల్డింగ్‌లలో నడుపుతూ మోసం చేస్తున్నారని అన్నారు. తక్షణమే అలాంటి ప్రైవేట్ పాఠశాలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అభిరామ్, శివ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వం తీసుకోవాలి


సభ్యత్వ నమోదు చేయిస్తున్న బీజేపీ నేతలు

వరంగల్ / కాశిబుగ్గ: దేశాన్ని మరింత అభివృద్ధి చేసుకునేందుకు ప్రతిఒక్కరూ బీజేపీ సభ్యత్వం తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు కోరారు. విశేష్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా 19, 20, 21వ డివిజన్లలో ఇంటింటికి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలో భారతదేశాన్ని శక్తివంతమైన దేశంగా నిలిపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ కృషి చేస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు సముద్రాల పరమేశ్వర్, కుసుమ సతీష్, బాకం హరిశంకర్, ఎరుకల రఘునారెడ్డి, కనుకుంట్ల రంజిత్, ఆనంద్, సిద్దోజు శ్రీనివాస్, రత్నం కిషోర్, కట్టర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


మాట్లాడుతున్న కార్పొరేటర్ కుమారస్వామి

ఖిలా వరంగల్: పాఠశాల పరిసరాల పరిశుభ్రతతో పాటు తడి, పొడి చెత్తను బల్దియా సిబ్బందికి వేర్వేరుగా అందించాలని స్థానిక కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి సూచించారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా వరంగల్ శివనగర్‌లోని ఏకశిల డీజీ స్కూల్ ప్రాంగణంలో బల్దియా సంస్థ, ఐటీసీ వావ్, శ్రీఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులు సంక్రమించే తీరు, తడి, పొడి చెత్తపై విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాచివడబోసిన నీటినే తాగాలని, కాళ్లు, చేతులు శుభ్రంగా కడుక్కున్న తర్వాతే భోజనం చేయాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వాడడంతో పర్యావరణానికి నష్టం వాటిల్లుతుందని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ కొండల్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లింగాల కుమారస్వామి, జవాన్ కుమార్, సురేందర్, ఆర్పీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలి

వరంగల్ అర్బన్: జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేసే ప్రక్రియను వెంటనే మొదలుపెట్టాలని టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జక్కుల విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జిల్లా అధ్యక్షుడు పొడేటి అశోక్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల కాల పరిమితి గత జూన్ వరకు పూర్తి కాగా, గడువు పొడిగిస్తూ ఐఅండ్‌పీఆర్ అధికారులు జాప్యం చేస్తున్నారని విమర్శించారు. జిల్లా కేంద్రం, నియోజకవర్గ కేంద్రం, మండల కేంద్రాల జర్నలిస్టులతో పాటు డెస్క్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. దేశాయిపేట ప్రాంతంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే కేటాయించాలన్నారు. జిల్లా కార్యదర్శి స్వామిదాస్, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, నాయకులు సురేందర్, బోనాల సాంబయ్య, కోశాధికారి రాజురెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.